

నిజాంపేట: లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాలు అందజేస్తున్న ఎంపీపీ సిద్ధిరాములు, ప్రజాప్రతినిధులు, నాయకులు

## నందిగామలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీ..

నిజాంపేట, అక్టోబర్ 8: బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే పేదోడి సొంతింటి కల నెరవేరుతున్నదని ఎంపీపీ సిద్ధిరాములు అన్నారు. మండలంలోని నందిగామలో నిర్మించిన 40 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ఆదివారం ఎంపీపీ స్థానిక సర్పంచ్ ప్రీతితో కలిసి లబ్ధిదారులకు కేటాయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పరిపాలన కొనసాగుతున్నదన్నారు. రూపాయి ఖర్చు లేకుండా నందిగామలో 40 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్‌కుమార్, మండల ఎంపీటీసీలు సురేశ్, బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఆరీఫ్‌హుస్సేన్, బీఆర్ఎస్ నిజాంపేట, నందిగామ గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగు స్వామి, ఏఎంసీ డైరెక్టర్ వెంకటేశం, నాయకులు తిరుమల్, నరేందర్, లక్ష్మీనర్సింహులు, రాజ్‌గోపాల్ తదితరులున్నారు.

### సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

నిలువ నీడ లేని మాకు కొన్ని ఏండ్లుగా వేరొకరి స్థలంలో గుడిసె వేసుకొని బతికినం. రాత్రి సమయంలో పాములు, తేళ్లతో భయంగా ఉండేది. డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. ఇప్పుడు ఇల్లు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. సీఎం కేసీఆర్ సార్‌కు రుణపడి ఉంటాం.

– కడమంచి పెంటమ్మ, లబ్ధిదారు, నందిగామ, నిజాంపేట మండలం



# సొంతింటి కల నెరవేరుస్తున్న సీఎం కేసీఆర్

**అందజేసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మహిళా కమిషన్ చైర్మన్ సునీతాలక్ష్మారెడ్డి**

**ఉప్పలింగాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ**



లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాలను అందజేస్తున్న నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి

వెల్దుర్తి, అక్టోబర్ 8: గూడు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ఘనత సీఎం కేసీఆర్, తెలంగాణ ప్రభుత్వానికి దక్కుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఉప్పులింగాపూర్‌లో నిర్మించిన 48 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పట్టాలను ఆదివారం లబ్ధిదారులకు, మహిళలకు బతుకమ్మ చీరలు, యువకులకు ముఖ్యమంత్రి క్రీడాపరికరాలను డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ప్రతి కుటుంబానికి సొంత ఇలు నిర్మించుకోవాలనేది కల అని, అలాంటి వారి కలను సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ సర్కార్ నెరవేస్తున్నదన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించి, రూపాయి ఖర్చు లేకుండా పేదలకు అందిస్తున్నదని వివరించారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. మహిళలు ప్రత్యేకంగా జరుపుకొనే, పూలను పూజించే ఏకైక పండుగ బతుకమ్మ. ఈ పండుగకు రాష్ట్ర సర్కారు ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిందన్నారు. బతుకమ్మ పండుగను మహిళలు సంతోషంగా జరుపుకోవాలని ప్రభుత్వం చీరలు పంపిణీ చేస్తున్నదని తెలిపారు. గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి, గ్రామీణ ప్రాంత యువకుల్లో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి, వారిని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ప్రభుత్వం తీర్చిదిద్దాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి క్రీడాపరికరాలను అందిస్తున్నదన్నారు. యువకులు ఈ క్రీడా పరికరాలను సద్వినియోగం చేసుకుని, ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యమ్మభూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, అంజనేయులు, సునందారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఖాజా, చందు, మైసయ్యా, రాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు పాల్గొన్నారు.



యువకులకు ముఖ్యమంత్రి క్రీడా పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే, మహిళా కమిషన్ చైర్‌పర్సన్

# కాంట్రాక్టు లెక్చరర్ల జీవితాల్లో వెలుగులు

**మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్ అర్బన్, అక్టోబర్ 8: కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసి వారి జీవితాల్లో సీఎం కేసీఆర్ వెలుగులు నింపారని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేసినందుకు ఆదివారం మెదక్ పట్టణంలోని మాయ గార్డెన్స్‌లో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సభకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వాలు కాంట్రాక్టు లెక్చరర్లతో వెట్టి చాకిరి చేయించారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కాంట్రాక్టు లెక్చరర్స్ పాత్ర మరువలేనిదని, ఉద్యమంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం కేసీఆర్ రెగ్యులరైజ్ చేశారన్నారు. బంగారు తెలంగాణ నిర్మాణంలో లెక్చరర్లు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఇటీవల మెడికల్ కళాశాలకు శంకుస్థాపన చేశామన్నారు. అంతకుముందు తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కనక చంద్రం మాట్లాడుతూ కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేయడంలో మంత్రి హరీశ్‌రావు పాత్ర మరువలేమన్నారు. రెగ్యులరైజ్‌కు ముందుగానే పే స్కేల్ ఇప్పించారని కొనియాడారు. గెజిటెడ్ హోదా కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని లెక్చరర్లు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, తెలంగాణ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ మెదక్ జిల్లా అధ్యక్షుడు అశోక్, కౌన్సిలర్ ఆర్కే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పూజలు అందుకుంటున్న దుర్గామాత

# ఏడుపాయల్లో భక్తుల సందడి

పాపన్నపేట, అక్టోబర్ 8: పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవానీ అమ్మవారి సన్నిధిలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తుల సందడి నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి ఏడుపాయల చేరుకున్న భక్తులు మంజీరా నదిలోని వివిధ పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు, బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏడుపాయల చైర్మన్ సతెల్లి బాలాగౌడ్, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, రవివీర్ కుమార్, లక్ష్మీనారాయణ, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్, సంతోష్ తదితరులు ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేశారు. వేద పండితులు శంకర్ శర్మ, పార్థివ శర్మ, మురళీధర్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, పాపన్నపేట ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు.



క్యూలైన్లో భక్తుల సందడి

# గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం

**అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్**

**తాలెల్మలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం**



అందోల్: గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

అందోల్, అక్టోబర్ 8: గ్రామాల అభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తాలెల్మ గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే రూ.20 లక్షలతో నిర్మిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రం భవనం నిర్మాణం పనులు, రూ.10 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీహాల్ భవనాల పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు గృహలక్ష్మి ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి బీఆర్ఎస్ ప్రభుత్వ కొలువుదీరిన తర్వాత మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయన్నారు. పల్లెప్రగతి ద్వారా ప్రతీ గ్రామంలో ఎన్నో మౌలిక సదుపాయాలు సమకూరాయని, ఇవన్నీ సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమయ్యాయన్నారు. తాలెల్మలో అన్ని వార్డుల్లో ఇప్పటికే సీసీ రోడ్లు, మురికికాల్వలు నిర్మించామని అభివృద్ధి పనుల విషయంలో గ్రామ సర్పంచులు, అధికారుల సహాయ, సహకరం ఎంతో ఉన్నదని మెచ్చుకున్నారు. గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుంచుతూ జిల్లాలో ఉత్తమ పంచాయతీగా నిలిపారని మెచ్చుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు జైపాల్‌రెడ్డి, స్టేట్‌మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీపీ బాలయ్యా, గ్రామ సర్పంచ్ లింగాగౌడ్, మున్సిపల్ చైర్మన్ మల్లయ్యా, వైస్ చైర్మన్ ప్రవీణ్, పార్టీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణాగౌడ్, సర్పంచులు అనిల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, నాయకులు వీరేశం, వెంకటేశం, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అందోల్: తాలెల్మలో కార్యక్రమానికి హాజరైన మహిళలు